ప్రజాశక్తి

మంగళవారం 29 ఏప్రిల్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

గ్రేటర్ పీఠంపై పీలా

- మేయర్‌గా ఏకగ్రీవ ఎన్నిక
- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడి

మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థ (జివిఎంసి) మేయర్ పీఠాన్ని టిడిపి కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు సోమవారం అధిష్టించారు. దీంతో కూటమి శ్రేణులు ఆనందడోలికల్లో తేలియాడాయి. పలుచోట్ల సంబరాలు చేసుకున్నారు. తొలుత సోమవారం ఉదయం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్ మేయర్ ఎన్నికపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అజెండాలోని ఏకైక అంశమైన మేయర్ ఎంపికకు కూటమి తరుపున బిసి జనరల్ కోటాలో మేయర్ అభ్యర్థిగా పీలా శ్రీనివాసరావు ఒక్కరే బి ఫారం సమర్పించారు. అనంతరం జనసేన తరపున ఆయన్ని విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు మిగతా 2లో..

పీలాతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న మయూర్ అశోక్

సున్నితమైన భావజాలపు

అక్షరాన్ని నిలబెట్టాలి

- సమాజంపై రుద్దబడుతున్న వికృత, విధ్వంసక భావాల విస్ఫోటనాన్ని అడ్డుకోవాలి
- ప్రముఖ రచయిత తెలకపల్లి రవి
- విశాఖలో కవులు, సాహితీవేత్తల ఇష్టాగోష్టి

మాట్లాడుతున్న రవి, వేదికపై అప్పలనాయుడు, దివాకర్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సమాజంపై రుద్ద బడుతున్న వికృత, విధ్వంసక భావాల విస్ఫో టనాన్ని అడ్డు కునేందుకు సున్నితమైన భావజాలపు అక్షరాన్ని నిలబెట్టుకోవాలని ప్రముఖ రచయిత, రాజకీయ విశ్లేషకులు, సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి ఉద్ఘాటించారు. ఉత్తరాంధ్ర సాహితీ వీచికలు పేరిట సాహితీ స్రవంతి ఆధ్వర్యాన 'రైటర్స్ ఇష్టాగోష్టి' కార్యక్రమం విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సోమవారం సాయంత్రం జరిగింది. దీనికి సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రవి మాట్లాడుతూ అన్ని విలువలూ అంతరించిపోతున్న సమయంలో వాటికి ప్రాణం పోసి నిలబెట్టే పాత్రను సాహిత్యం పోషిస్తుందన్నారు. నేటి సామాజిక పరిస్థితుల్లో రాజకీయం కానిదంటూ ఏదీ లేదని అన్నారు. సమాజ స్థిరాస్తులన్నీ చెరబట్టబడి చరాస్తులుగా మారిపోతున్న నేటి తరుణంలో 'ఇష్టాగోష్టులు కాకుండా కష్టాల గోష్టులు' నిర్వహించుకోవాల్సి ఉంటుందని అనగానే సభలో ఒక్కసారిగా చప్పట్లు మ్రోగాయి. మనోభావాలు, మన భావాలు దెబ్బతీసే పరిస్థితుల్లో అవి వ్యక్తీకరించడానికి కవిత్వం కొన్ని సవాళ్లను సైతం ఎదుర్కోనాల్సి మిగతా 2లో..

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ బకాయిలు చెల్లించాలి

▶ వార్త 6లో..

రాజ్యాంగ మౌలిక వ్యవస్థలపై బిజెపి దాడి

▶ వార్త 4లో..

డిసిసిబి చైర్మన్‌గా కోన తాతారావు

▶ వార్త 3లో..

కెజిహెచ్‌లో

కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం

నిరుపేద రోగి జీవితంలో వెలుగులు

యశ్వంత్‌తో కెజిహెచ్ వైద్యులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రెండేళ్లుగా దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధితో బాధ పడుతున్న విశాఖ ఓల్డ్‌టౌన్, ఎవిఎన్ కాలేజీ డౌన్‌కు చెందిన 16 ఏళ్ల యశ్వంత్‌కు కెజిహెచ్ వైద్యులు నూతన జీవితాన్ని ప్రసాదించారు. విజయవంతంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించారు. దీనికి సంబంధించి కెజిహెచ్ సూపరిం టెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపిన వివరాలివి. బాధితుడు యశ్వంత్ రెండేళ్లుగా కిడ్నీ సమస్యతో బాధ పడుతున్నాడన్నాడు. తండ్రి లేని పరిస్థితుల్లో తల్లి సంతోషి సంరక్షణలో ఉన్న యశ్వంత్‌కు జీవన్‌దాన్, అవయవదాన కార్యక్రమం ద్వారా, ఈనెల 7న కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ విజయవంతం కావడం యశ్వంత్ కోలుకుని పూర్తిఆరోగ్యంతో ఉండడంతో సోమవారం డిశ్చార్జి చేశారు. ఈ ఆపరేషన్‌కు బయటి ఆసుపత్రుల్లో రూ.15లక్షలు ఖర్చవుతుందని, కెజిహెచ్‌లో ఎన్‌టిఆర్ వైద్యసేవ ద్వారా ఉచితంగా చేశామన్నారు. ఆపరేషన్ తర్వాత రెండేళ్ల వరకు రూ.రెండు లక్షల విలువైన మందులను కూడా ఉచితంగా అందజేశామన్నారు. కెజిహెచ్ నెఫ్రాలజీ మిగతా 2లో..

చందనోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

సమీక్షా సమావేశంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 30న జరిగే శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి చందనోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. చందనోత్సవ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో ఆయన కలెక్టరేట్‌లో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధారణ భక్తుల దర్శనాలకు తొలి ప్రాధాన్యతనిస్తామన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి పొరపాట్లకూ తావులేని విధంగా చందనోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. చందనోత్సవం రోజు తెల్లవారుజాము 3 గంటలకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తతో తొలి దర్శనం ప్రారంభమవుతుందన్నారు. 3.30 నుంచి 4 గంటల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి పట్టువస్త్రాలు సమర్పిస్తారని, అనంతరం తితిదే వారు పట్టువస్త్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు ఎక్కడికక్కడ తాగునీరు, మజ్జిగ, బిస్కెట్లు ఏర్పాట్లు చేయాలని, చిన్న పిల్లలకు పాలు సమకూర్చాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సింహాచలం కొండపైన, కొండ దిగువున శానిటేషన్, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శానిటేషన్ సిబ్బందిని నియమించడంతోపాటు వారందరికీ విధులు నిర్వహించేందుకు వీలుగా డ్యూటీ పాసులు పంపిణీ చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి కొండపైన 8, కొండ దిగువున 7 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని, 29, 30 తేదీలలో 4 షిఫ్టులలో మొత్తం 513 మందిని చందనోత్సవ విధులకు వినియోగిస్తున్నామని తెలిపారు. 32 అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచుతున్నామని, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు 10 స్ట్రెక్చర్‌లను సమకూర్చామని తెలిపారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ మందులను, స్పెషలిస్ట్ డాక్టర్లను అందుబాటులో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

గ్రేటర్ పీఠంపై పీలా

వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఎన్‌డిఎ తరుపున బిజెపి విశాఖ ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యులు విష్ణుకుమార్ రాజు బలపరిచారు. అనంతరం మేయర్ ఎన్నికకు కావలసిన 56 మంది సభ్యుల కోరంకుగాను 67 మంది సభ్యులు హాజరై పీలా శ్రీనివాసరావును మేయర్‌గా బలపరచడంతో ఎన్నికల అధికారి ఆయనను జివిఎంసి మేయర్‌గా ఎన్నికైనట్టు ప్రకటించారు. అనంతరం అతనిచే ప్రమాణ స్వీకారం చేయించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. దీంతో ఆయన గ్రేటర్ మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన మూడో వ్యక్తిగా నిలిచారు.

విలువ కట్టలేని బాధ్యతలివి..!

ఎన్నిక అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పీలా మాట్లాడుతూ విలువ కట్టలేని బాధ్యతలను సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, యువ నేత నారా లోకేష్ తనకు అప్పగించారని అన్నారు. దీన్ని పదవిగా కాకుండా బాధ్యతగా స్వీకరించి ప్రజా నాయకునిగా గుర్తింపు పొందేందుకు కృషి చేస్తానన్నారు. విశాఖ ప్రజలు విలువలు కలిగిన వారని, వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకు అహర్నిశలూ పనిచేస్తానని అన్నారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు, తన పదవికి న్యాయం చేస్తానని అన్నారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా గడిచిన నాలుగేళ్లు ప్రతిపక్షంలో ఉండి పోరాటం చేసిన అనుభవంతో వచ్చే 11 నెలలు పని చేస్తానని తెలిపారు. డిప్యూటీ మేయర్ ఎన్నికపై కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. విశాఖలో ప్రధానంగా ఉన్న నీటి, వీధి దీపాల సమస్యలను, పారిశుధ్య విభాగంలో ఉన్న అవినీతిని సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ప్రతిరోజూ ఏదో సమయంలో ప్రజలతో కలుస్తూ వారి సమస్యలను తెలుసుకుంటానన్నారు. నెల రోజుల్లో జి20లో జరిగిన అవినీతిని బయటకు తీస్తామని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సంబరాల్లో కూటమి నేతలు

మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావును టిడిపి నాయకులు, కూటమి శాసనసభ్యులు, కార్పొరేటర్లు అభినందించారు. అనంతరం జివిఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట బాణసంచా పేలుస్తూ కూటమి కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్ల వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడుతూ నేటి నుండి కూటమి ప్రభుత్వం పరిపాలన సాగించనుందన్నారు.

సున్నితమైన భావజాలపు అక్షరాన్ని నిలబెట్టాలి

వస్తుందన్నారు. కాలం, పరిస్థితులు మారినప్పుడు సాహితీ సృజనలు, కవితలు ఎలా మార్చుకోవాలో మన ముందు నడుస్తున్న చరిత్రను ఎలా అర్థం చేసుకోవాలో కవులు, రచయితలు ఆలోచన చేయాలన్నారు.

సాహిత్యం నిశ్శబ్దంగా లేదు : అట్టాడ అప్పలనాయుడు

సాహిత్యం నిశ్శబ్దంగా లేదని.. అక్షరం శక్తివంతమైనదని, రచయితలూ శక్తివంతులేనని ఉత్తరాంధ్ర సాహితీవేత్త అట్టాడ అప్పలనాయుడు ఉద్ఘాటించారు. సాహితీవేత్తల ఇష్టాగోష్టికి విశిష్ట అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో పాలకులను ప్రశ్నిస్తున్న కవులు ఉన్నారని, ఇలాంటి రచయితలు ప్రజల హృదయాలను ప్రతిబింబిస్తున్నారని అన్నారు. సామాజిక వాస్తవాలను రచయితలు గ్రహించాలన్నారు. ప్రశ్నిస్తాను అన్నవాడు సనాతనంలోకి జారిపోయాడని అట్టాడ అనగానే సభలో ఒక్కసారి నవ్వులు గొల్లుమన్నాయి. రాజ్యాంగం ప్రకారం పరిపాలించలేని స్థితిలో 'రాజ్యం' ఉందని వివరించారు. ప్రభుత్వాలు కాషాయీకరణతోనూ, కార్పొరేట్లతోనూ నడుస్తున్నాయన్నారు. కళింగాంధ్ర వర్తమాన సామాజిక స్థితిగతులను రాసే యువత సాహిత్యంలోకి వస్తున్నారన్నారు. ఏదో ఒక రూపంలో సాహిత్యం ద్వారా ప్రభుత్వాలకు ప్రశ్నలు వెళ్తున్నాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన చీకటి దివాకర్ మాట్లాడుతూ సమాజం మారడంతో పాటు అనేక రంగాల్లో మార్పులొస్తున్నాయన్నారు. సామాజిక మాధ్యమాల్లో రీల్స్ అధిక మందికి రీచ్ అవుతున్నాయని, సాహిత్య ప్రక్రియలో ఇలాంటి మెళకువలను కవులు స్వీకరించి సమాజ హితం కోసం రీల్స్ చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రి, ఉప్పాడ రాము, మౌళి, రవిశంకర్, ఉప్పల అప్పలరాజు, కె.శ్రీనివాస్ తదితర కవులంతా మాట్లాడుతూ చదివించే విషయాన్ని ప్రజలకు ఇస్తే అన్నీ చదువుతారని అన్నారు. కథలు, సాహిత్యం, జనం దగ్గరకే వెళ్లాలని సూచించారు.

చందనోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

ఉంచినట్లుగా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జిల్లా కలెక్టర్‌కు వివరించారు. చందనోత్సవానికి సంబంధించి కొండపైన, దిగువన విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా, విద్యుత్ లోడ్ ఎక్కువైతే ట్రిప్ కాకుండా అన్ని సబ్ స్టేషన్‌లను తనిఖీ చేయాలని, పార్కింగ్ ఏరియాలలో లైటింగ్ ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దర్శనానికి వెళ్లే భక్తులకు సంబంధించి క్యూలైన్ల ఏర్పాటు, బారికేడ్ల విషయంపై ఆర్ అండ్ బి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఆర్టీసీ బస్సులకు సంబంధించి పూర్తి ఫిట్‌నెస్‌ను నిర్ధారించిన బస్సులను మాత్రమే కొండ దిగువు నుంచి కొండపైకి, అదేవిధంగా కొండపై నుంచి కొండ దిగువకు భక్తులను చేరవేసేందుకు వినియోగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏదైనా వాహనం బ్రేక్ డౌన్ అయినట్లయితే వెంటనే రిపేరు చేసేందుకు మెకానిక్లను అందుబాటులో ఉంచాలన్నారు. దర్శన టిక్కెట్లకు సంబంధించి ఆన్లైన్ మరియు ఆఫ్లైన్ ద్వారా టికెట్లు అమ్మకాలు, టికెట్లపై సీరియల్ నెంబర్, స్కానింగ్, క్యూలైన్లు తెలిపే బోర్డులు తదితర ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం

హెచ్ఓడి డాక్టర్ జి.ప్రసాద్, యూరాలజీ హెచ్ఓడి డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రాంబాబు, అనస్తీషియా డాక్టర్లు డాక్టర్ లక్ష్మి, డాక్టర్ ప్రీతి, డాక్టర్ రమేష్, నర్సింగ్ సిబ్బంది సూర్యప్రభ, చంద్రకళ, ఇతర సహాయక సిబ్బంది ఆపరేషన్‌లో పాల్గొని విజయవంతం చేయడంపై వారిని డాక్టర్ శివానంద అభినందించారు.

అర్హులందరికీ ఉచిత గ్యాస్ అమలు చేయాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : అర్హులైన వారందరికీ ఉచిత గ్యాస్ సిలండర్ పథకం కింది డబ్బులను లబ్ధిదారుల ఖాతాలకు తక్షణమే జమ చేయాలని సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. సోమవారం ఎఎస్ఒ సర్కిల్ 2 పరిధిలోని మద్దిలపాలెం, ఆరిలోవ ప్రాంతాల లబ్ధిదారులతో కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, ప్రజలు

ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ ఏటా మూడు వంటగ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తామని హామీనిచ్చిన కూటమి ప్రభుత్వం, వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు.. సిద్దార్ధనగర్, మద్దిలపాలెం, అంజయ్యనగర్, బిఎన్ఆర్.నగర్, రామకృష్ణాపురం వంటి కొన్ని కాలనీలలో సిపిఎం ప్రజా చైతన్యయాత్ర సందర్భంలో ఉచితగ్యాస్ అందడం లేదని అనేకమంది చెప్పగా, వారితో దరఖాస్తులు పెట్టించినా ఇకెవైసి, బ్యాంకు ఖాతాలకు ఫోనులింక్ వంటి కారణాలను చూపుతున్నారే తప్ప వాటిని పరిష్కరించడం లేదన్నారు. మొదటి విడతలో డబ్బులు జమైన వారికి రెండోవిడతలో ఈనెల జమ కావాల్సి ఉన్నా ఇప్పటికీ రాలేదన్నారు. ఉచిత గ్యాస్ డబ్బులు అందని వారిలో అత్యధికులు ఎస్‌సి, ఎస్‌టి,ఒంటరి మహిళ, వికలాంగులు ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ సిటీ ఎఎస్ఒకు వినతిపత్రం దరఖాస్తులు అందజేశారు. తక్షణమే ప్రభుత్వం టీంలు వేసి ఉచిత గ్యాస్ పథకం అర్హులందరికీ వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎ.ఎస్.ఓ సిటీ అధికారికి వినతిపత్రం, దరఖాస్తులు అందజేసారు.

ఎఎస్ఒ సర్కిల్-2 అధికారి పోస్టు ఖాళీగా ఉండడం, రేసపువాని పాలెంలోని ఎఎస్ఒ కార్యాలయం కలెక్టర్ ఆఫీస్‌కు తరలించడంతో మధురవాడ,ఆరిలోవ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, డెయిరీఫాం ఆదర్శనగర్‌లో ఎఎస్ఒ-2 కార్యాలయాన్ని ప్రారంభించి, అధికారిని నియమించాలని కోరారు. నిరసనలో సిపిఎం నాయకులు వి.నరేంద్రకుమార్, కె.కుమారి, నాగరాజు, చంద్రమౌళి, ఎన్.వి.రమణ, జి.ఎస్.ఎన్.రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పదవికి పల్లా రాజీనామా చేయాలి

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : తనపై తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ మండిపడ్డారు. సోమవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ, తాను వైసిపి కోవర్డునని పల్లా అనుచరుడు ఆరోపిస్తున్నాడని, ఎవరు కోవర్టో పల్లా చెప్పాలన్నారు. వైసిపి పాలనలోగాజువాకలోని పల్లా భవనాన్ని అప్పటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కనుసన్నల్లోనే కూల్చేశారని, అటువంటి వ్యక్తి గుడివాడ పారిశ్రామిక ప్రాంతంలోఅక్రమ భవనాన్ని నిర్మిస్తుంటే, ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారో చెప్పాలన్నారు. గుడివాడ అక్రమాలను పల్లా ప్రోత్సాహిస్తున్నారని ఆరోపించారు. మీడియా ముందు విపక్షం అక్రమాలను ఎండగట్టలేనిఅసమర్థ వ్యక్తి తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్ష పదవికి పనికిరాడని, వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలని సిఎం చంద్రబాబును కోరారు.

ఎమ్మెల్యే పదవికి పల్లా శ్రీనివాసరావు రాజీనామా చేసి మళ్ళీ పోటీ చేయాలని గెలవాలని సవాల్ విసిరారు. టిడిపిలోనే ఉంటూ వైసిపి అనుకూలంగా వ్యవహరిస్తున్న పల్లా వంటి వ్యక్తులను గుర్తించడానికి తెలుగుశక్తి ఆధ్వర్యంలో జిల్లాకో కోఆర్డినేటర్‌ను త్వరలో నియమిస్తామన్నారు. గాజువాక నియోజకవర్గంలోని వైసిపి కార్పొరేటర్లు, టిడిపిలోకి కాకుండా జనసేనలోకి వెళ్లడం సిగ్గుచేటన్నారు.

సమస్యల పరిష్కారానికి సిహెచ్‌ఒల ధర్నా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎన్‌హెచ్‌ఎం ద్వారా గ్రామీణ ప్రాంత ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రాల్లో పనిచేస్తున్న, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంటా సుధ, ఎంఎస్ఎన్ ప్రజ్ఞ, మాట్లాడుతూ, ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్ల సర్వీసు పూర్తయిన వారిని రెగ్యులర్‌చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ, పని ఆధారిత ప్రోత్సాహకాల, ఇపిఎఫ్ పునరుద్ధరణ,క్లినిక్ అద్దె బకాయి చెల్లింపు, నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అమలు, హెచ్ఐర్ పాలసీ, ఇంక్రిమెంట్, బదిలీలు, ఎక్స్‌గ్రేషియో, పితృత్వ సెలవులు వంటి ప్రయోజనాలు కల్పించాలన్నారు..సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు జి. సుధారాణి, పి.దివ్య,బి. శ్రావణి, టి. మోషే, జస్వంత్ పాల్గొన్నారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వెయిటింగ్ లిస్ట్‌లోని ప్రయాణీకుల అదనపు రద్దీని తగ్గించడానికి, తూర్పు కోస్తా రైల్వే మే ఒకటి నుంచి 31 వరకు పలు రైళ్లలో అదనపు కోచ్‌లను పెంచింది. 18525, 18526 విశాఖపట్నం - బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్, 22819, 22820 విశాఖపట్నం - భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్‌లు, 18511, 18512 విశాఖపట్నం - కోరాపుట్ ఎక్స్‌ప్రెస్‌లకు రెండేసి జనరల్ క్లాస్ కోచ్‌లు, అలాగే, 58527, 58528 విశాఖపట్నం - రాయ్‌పూర్ ప్యాసింజర్ ఎక్స్‌ప్రెస్, 58537, 58538 విశాఖపట్నం - కోరాపుట్ ప్యాసింజర్ ఎక్స్‌ప్రెస్, 58531, 58532 విశాఖపట్నం - బ్రహ్మపూర్ ప్యాసింజర్ ఎక్స్‌ప్రెస్, రైళ్లకు ఒకటి చొప్పున జనరల్ సీటింగ్ కోచ్‌లను జతచేయనున్నారు.

ట్రాఫిక్ పోలీసులకు 'రేడియం కూల్ జాకెట్లు'

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ.: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి వేసవి తాపం నుంచి ఉపశమనానికి రేడియం కూల్ జాకెట్లను సిపి శంఖబ్రత బాగ్చీ సోమవారం పంపిణీ చేశారు. దాతల సహకారంతో రూ.ఐదు లక్షల విలువైన 200 జాకెట్లను అక్కడి హర్యానా నుంచి రప్పించి సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ జాకెట్లతో కలిగే ప్రయోజనాలను వివరించారు.

'అప్పలరాజుపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ :తక్కువ ధరలో ప్లాట్లు ఇస్తానని, ఇన్‌స్టాల్‌మెంట్లలో డబ్బులు కట్టవచ్చని నమ్మబలికి ,20 కూలీ కుటుంబాల నుండి రూ.కోటిన్నర వసూలు చేసి మోసం చేసిన విశాఖపట్నంలోని డాక్ యార్డ్ ఉద్యోగి పాల అప్పలరాజుపై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై రాజు డిమాండ్ చేశారు. సోమవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బాధితులు నిరసన తెలిపారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, దినసరి కూలీలకు సొంతిళ్లు వస్తుందని నమ్మబలికి డబ్బులు వసూలుచేశాడని, ప్లాట్లు ఇవ్వకపోవడంతో తీసుకున్న డబ్బులు తిరిగివ్వాలని అడిగిన బాధితుల పట్ల అవహేళనగా, కులదూషణ చేస్తూ, మహిళలను దౌర్జన్యంగా నెట్టేసిన అప్పలరాజుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులంతా పూర్తి సాక్ష్యాధారాలతో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని, తీరా అప్పలరాజు బదిలీపై వెళ్లిపోయాక, ఎక్కడున్నాడో చెబితే చర్యలు తీసుకుంటామని నిర్లక్ష్యంగా అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పలరాజుపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలన్నారు.

IN THE HONOURABLE COURT OF THE MOTOR ACCIDENTS CLAIM TRIBUNAL FAMILY JUDGE AT SRIKAKULAM
M.V.O.P. No 74/2023

Between:
Chandaka Anuradha ...Petitioner.
And:
Dirisam Amar Kumar and others ...Respondents.

To,
R-1: Dirisam Amar Kumar, S/o late Aarogya rao Bind, Hindu, aged about 31 years, driver of lorry Bearing no. AP-31-EU-2842, pedamasali by casate R/O D.No.19-27-38, pedanadupuram, Pedagantyada Visakhapatnam.

NOTICE

It is to inform you that the above matter stands posted to on 30-04-2025 for your appearance. Hence you have to appear before the Honourable court on **30-04-2025 at about 10.30 AM** .as in person or through an advocate without fail,otherwise the matter will be decided in your absence.

// By order of the Honourable court//

K SANKARA RAO
ADVOCATE,
SRIKAKULAM.

IN THE HONOURABLE COURT OF IV ADL. CUM SC & ST (POA) JUDGE AT VIZIANAGARAM
MOP 381/2024

Between:
Olle Gopinadha Rao .....Petitioner
And :
Bojanki Ramana and 2 others ....Respondents
To
Respondent No-1 Address
Sri Bojanki Ramana S/o late Jagannadham, Hindu, aged 50yrs, Driver of mini Truck No. AP39W 7975, Residing at D.No.51-9-32S, Nakkavanipalem, Eenadu, HB Colony, Visakhapatnam Urben - 530022.

Hg Date : 13-05-2025

పై నెంబరు కేసులో రెస్పాండెంట్ నెంబరు-1 నోటీసు తీసుకొనకుండా తిరుగుచున్నందున శ్రీ కోర్టువారు సదరు రెస్పాండెంట్ నెంబరు-1కి ఈ పేపరు ప్రకటన ద్వారా **తేది 13-05-2025న** హాజరు నిమిత్తము **ఉదయం గం|| 10-30 ని||**లకు ఖుద్దునగాని, వకీలు గారు ద్వారా గాని పైన తెలిపిన కోర్టులో హాజరు అయి ఏమైన ఆక్షేపణలు యున్న యెడల తెలియజేయవలసిందిగా కోరడమైనది. లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని యిందు మూలకముగా రెస్పాండెంట్ నెంబరు-1కి తెలియజేయడమైనది.

//By Court Order//

Sri Ponnada Sankara Rao
Advocate, Gajapathinagaram,
Cell : 9866819068

ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ చేయాలి

గోపాలపట్నం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న పేదలు

ప్రజాశక్తి- మాధవధార : కప్పరాడ, ఇందిరానగర్ ప్రాంతాల్లో, పెద్ద కొత్తూరు, అల్లూరి సీతారామరాజు నగర్‌లో వేలాదిమంది పేద, మధ్యతరగతి ప్రజలకు 2016, 2017 సంవత్సరాల్లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 296, 388 జిఒల ప్రకారం ఇచ్చిన పట్టాలను రిజిస్ట్రేషన్ చేయాలని, జిఒ 30 ప్రకారం పేదల ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో గోపాలపట్నం తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. సిపిఎం కంచరపాలెం జోన్ కార్యదర్శి బి.ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో బి.పద్మ మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా ప్రభుత్వ భూముల్లోనూ, పోరంబోకు స్థలాల్లోనూ, కొండవాలు, మురికివాడల ప్రాంతాల్లోనూ రేకుల షెడ్, శ్లాబులు వేసుకొని జీవిస్తున్నవారికి ప్రభుత్వం రిజిస్ట్రేషన్‌తో కూడిన పట్టాలను మంజూరు చేయాలని కోరారు. వివాదస్పద స్థలాల్లో ఉన్న వారికి ప్రభుత్వమే పరిష్కారం చూపి పట్టాలు మంజూరు చేయాలన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు తలదాచుకోవడానికి ప్రభుత్వ సొంతింటి కళ ఎలాగూ నెరవేర్చలేకపోతుందని, కనీసం పేదలు వేసుకున్న ఇళ్లకు పట్టా కాగితం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. జిఒ 296, 388 ప్రకారం కొంతమందికి పట్టాలు జారీచేసి, మార్కెట్ వాల్యూ ప్రకారం పట్టాలు మంజూరు చేస్తామని చెప్పి కొద్దిమందికి మాత్రమే పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. తక్షణమే పట్టాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించాలని, పట్టాలు లేనివారికి పట్టా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జోన్ నాయకులు ఒ.అప్పారావు, ఎం.ఈశ్వరావు, బి.సింహాచలం, అప్పారావు, పద్మ, చందు తదితరులు పాల్గొన్నారు.

డిసిసిబి చైర్మన్‌గా కోన తాతారావు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక జనసేన నాయకులు కోన తాతారావును డిసిసిబి చైర్మన్ పదవి వరించింది. పెదగంట్యాడ అయ్యన్నపాలెంకి చెందిన తాతారావు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి. 1987వ సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీలో చేరి గుడివాడ గురునాథరావుకు దగ్గరగా ఉండేవారు. 1999వ సంవత్సరంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగిగా ఉంటూ, గాజువాక మున్సిపాలిటీకి చైర్మన్‌గా పోటీ చేసి 10 వేలు ఓట్లు సాధించారు. తర్వాత 2005వ సంవత్సరంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగానికి రాజీనామా చేసి జివిఎంసి ఎన్నికల్లో పోటీ పడ్డారు. అప్పుడున్న 51వ వార్డుకు తెలుగుదేశం పార్టీ తరపున కార్పొరేటర్‌గా గెలిచారు. తర్వాత టిడిపి జిల్లా అధ్యక్షులుగా పనిచేశారు. 2014వ సంవత్సరంలో యాదవ సామాజిక వర్గం కోటాలో ఎమ్మెల్యే సీటు కోసం ప్రయత్నించారు. చివరి నిమిషంలో పల్లా శ్రీనివాసరావుకు సీటు కేటాయించడంతో తెలుగుదేశం పార్టీలో ఉంటే భవిష్యత్తు కష్టమని 2018వ సంవత్సరంలో జనసేన పార్టీలో చేరారు. 2019వ సంవత్సరంలో తూర్పు నియోజకవర్గం నుంచి జనసేన తరుపున ఎమ్మెల్యేగా పోటీ చేశారు. 2024లో కూటమి ఒప్పందాల్లో భాగంగా ఎక్కడా ఎమ్మెల్యే సీటు కేటాయించలేదు. దీంతో ఈయన ప్రచారానికి పరిమితమయ్యారు. ఇప్పుడు డిసిసిబి పదవి రావడం పట్ల స్థానిక అభిమానులు, ఆయన కుటుంబ సభ్యులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

బాల్య వివాహాలు నేరం

ప్రజాశక్తి - ఆరిలోవ : బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని నిరోధించవల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందని అప్ హోల్డ్ సంస్థ జిల్లా సమన్వయకర్త జి.డేవిడ్‌రాజు పేర్కొన్నారు. పెదగదిలి శివాలయం వద్ద సామాజిక భవనంలో అప్ హెల్ద్ ఆర్గనైజేషన్, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జెఆర్‌సి) సంయుక్త ఆధ్వర్యాన సోమవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అక్షయ తృతీయ, వివాహాల సీజన్ దృష్ట్యా బాల్య వివాహాలను నిరోధించడానికి అనేక అవగాహన కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నో అనర్థాలకు కారణమైన బాల్యవివాహాలను అడ్డుకునేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఇప్పటికే అన్ని మత దేవాలయాల పెద్దలను కలిసినట్లు తెలిపారు. అన్ని దేవాలయాల్లోను, మసీదుల్లోను, చర్చిల్లోను బాల్యవివాహాలు అనుమతించబడవని, వాటిని ప్రోత్సహించడం, చేసుకోవడం చట్టరీత్యా నేరమని బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జెఆర్‌సి అనేది చట్టపరమైన జోక్యాల ద్వారా పిల్లల హక్కుల రక్షణ కోసం దేశంలోని 416 జిల్లాల్లో 250 వివిధ సంస్థలతో పనిచేస్తుందని చెప్పారు. గత ఏడాది రెండు లక్షలకు పైగా బాల్య వివాహాలను అడ్డుకున్నారు. బాల్యవివాహ రహిత భారతదేశం లక్ష్యంగా ఈ సంస్థ పనిచేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో సంస్థ కమ్యూనిటీ సోషల్ వర్కర్స్ చక్రవర్తి, కెవై.రత్నం పాల్గొన్నారు.

బీమా కార్డుల అందజేత

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని మామిడిలోవలో జనసేన బీమా కార్డులను సోమవారం కార్యకర్తలు పంచిపెట్టారు. గ్రామంలో 253 మందికి ప్రమాద బీమా వర్తించేలా ఇన్సూరెన్స్ చేయించినట్లు జనసేన కార్యకర్త కోరుకొండ శివాజీ తెలిపారు. జనసేన భీమిలి ఇన్‌ఛార్జి సందీప్ ఆదేశాల మేరకు మండల ప్రెసిడెంట్ తమ్మన అప్పలరాజు ఆధ్వర్యాన మామిడిలోవ గ్రామంలో కార్యకర్తల కుటుంబ సభ్యులకు ఆరోగ్య బీమా సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. ఇన్సూరెన్స్ చేయించిన మహిళలు, గ్రామస్తులు ఉపాధి పనులకు వెళ్లడంతో వారి వద్దకు వెళ్లి జనసేన కార్యకర్తలు కార్డులు అందజేశారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని విలాస్‌ఖాన్‌పాలెంలో సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఎండలను దృష్టిలో పెట్టుకొని గ్రామంలోని యువ మహిళలు పాలకేంద్రం వీధిలో మజ్జిగను సొంతంగా తయారుచేసి ప్రయాణికులకు పంపిణీ చేశారు. యువ మహిళా అధ్యక్షులు బోని రాధ, ఆర్.ధనలక్ష్మి, రమణి, ప్రశాంతి, బోని దేవి, బోని కమల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం బోయపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఒఎన్‌జి ఫౌండేషన్, బోయపాలెం ఎస్‌ఎంసి చైర్మన్ ఆధ్వర్యాన సోమవారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒఎన్‌జి ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివదళాయి, బోయపాలెం ఎస్‌ఎంసి చైర్మన్ చల్లా రామిరెడ్డి మాట్లాడుతూ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బాల బాలికలు మంచి ఫలితాలు సాధించారన్నారు. 72 మంది పరీక్షలు రాయగా 56 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. డి.ఈశ్వరమ్మ 552, వై.ప్రవళిక 557, ఎం.యమున 553, ఎస్.కావ్య 545, ఎం.రజిని 544 మార్కులు సాధించారని పేర్కొన్నారు. ప్రయివేటు పాఠశాలలకు ఏమాత్రం తీసుపోనివిధంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడంపై ఆనందం వ్యక్తంచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒత్తిడి లేని చదువులు ఉంటాయని, తల్లితండ్రులు ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు, షీల్డ్‌లు ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఒఎన్‌జి ఫౌండేషన్ సభ్యులు, స్కూల్ సిబ్బంది రామిరెడ్డి, శ్రీకాంత్, శివ, ఆనంద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఒఎన్‌సి సభ్యులు తదితరులు

తాగునీరు రావడంలేదని ఫిర్యాదు

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి జోన్ 2 పరిధి మధురవాడ చుట్టపక్కల ప్రాంతాలకు తాగు నీరు సక్రమంగా రావడంలేదని సిఐటియు ఆధ్వర్యాన పలు కాలనీల ప్రజలు జోనల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. నీరు సక్రమంగా రావడంలేదు సరికదా, వచ్చే నీరు కూడా నల్లగా, మురుగు వాసనతో వస్తుందని, నీటిని సరఫరా చేస్తున్న సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా మార్పులేదని వివరించారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మధురవాడ పోర్టు కాలనీకి తెల్లవారుజామున 3 గంటలకే నీటిని ఇచ్చేస్తున్నారని, వాంబేకాలనీ, పోర్టు కాలనీ, అయ్యప్పనగర్, స్వయంకృషి నగర్, కొమ్మాది, 81 కాలనీ, బోరవానిపాలెం, పరదేశిపాలెం, డ్రైవర్ కాలనీలకు నీరు సక్రమంగా రావడం లేదని వివరించారు. ప్రతి రోజూ ఉదయం సకాలంలో తాగునీటిని సరఫరా చేయాలని సిఐటియు నాయకుడు పి.రాజ్‌కుమార్ కోరారు.

భూములను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని వినతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : వారసత్వంగా ఏళ్ల తరబడి తమ అనుభవంలో ఉన్న భూములను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని కోరుతూ మండల తహశీల్దార్ పైలా రామారావుకు మండలంలోని తాటితూరు పంచాయతీకి చెందిన పలువురు రైతులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఆన్‌లైన్‌లో లేనందున భూముల క్రయ విక్రయాలు జరగక అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. తమ పిల్లల పెళ్లిళ్ల కోసం అప్పు కావాలన్నా, ఇళ్లు నిర్మించుకోవాలన్నా భూములను అమ్మేందుకు అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో అనేక సార్లు ఇదే సమస్యపై వినతి పత్రాలు అందజేశామని గుర్తు చేశారు. సంబంధిత భూములను ఆన్‌లైన్ చేయనప్పుడు రీ సర్వే చేసి ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతులు కె.రాము, ఎం.గురునాయుడు, ఎస్.రమణ, టి.సూర్యారావు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల్లో నాగాలాండ్ బృందం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది, కృష్ణాపురం, రేవిడి పంచాయతీల్లోని ఆరు అంగన్‌వాడీ కేంద్రాలను నాగాలాండ్ ఐసిడిఎస్ బృందం సోమవారం సందర్శించింది. విధి విధానాలను సభ్యులు పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో ఉన్న చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలతో మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగాలాండ్ ఐసిడిఎస్ సిడిపిఒ శిరోత నౌషా, నాగాలాండ్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లవ్ చూ, సిడిపిఒ శ్రీదేవి, సూపర్‌వైజర్లు అనిత, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఒకే అర్జీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి ఒకే అర్జీ అందినట్లు జెడ్‌సి పిల్లి ప్రేమప్రసన్నవాణి తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలో 33/11 కెవి శొంఠ్యాం సబ్‌స్టేషన్, 11 కెవి జిఎస్ అగ్రహారం ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఎఇ మండల అప్పలనాయుడు తెలిపారు. మామిడిలోవ, ఎన్‌జిఆర్.పురం, జిఎస్.అగ్రహారం, సత్తరువు జంక్షన్, గండిగుండం, రామవరం గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

'ప్రత్యాశ' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ మరియు మ్యూచవలీ ఎయిడెడ్ కో - ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యాన ప్రత్యాశ సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సిస్టర్ నిర్మల కొనియాడారు. ఆరిలోవ సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గత 35 ఏళ్లుగా ఆరిలోవ పరిసర ప్రాంతాలతో పాటు నగరంలోని వివిధ మురికి వాడల్లో మహిళల ఆర్థికాభివృద్ధికి, యువత, ట్రాన్స్‌జెండర్స్ కొరకు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. చిన్న తగాదాలతో విడిపోయిన కుటుంబాలను కోర్టుకు వెళ్లకుండా పరిష్కరించడం, ఆస్తి తగాదాలను సానుకూల వాతావరణంలో ఇరువర్గాలను పిలిపించి ప్రత్యాశ బృందం పరిష్కరిస్తుందని తెలిపారు. గత 15 ఏళ్ళుగా విడిపోయిన సుమారు 200 కుటుంబాలను తిరిగి కలిపినట్లు వివరించారు. మత్తుకు బానిసలు కాకుండా కౌన్సెలింగ్ ఇస్తున్నారని తెలిపారు. త్వరలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యాశ బృందం, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పాలిసెట్ పరీక్షకు ఏర్పాట్లు

ప్రజాశక్తి- పెందుర్తి : పెందుర్తి పాలిటెక్నిక్ కాలేజీ పరిధిలో ఈ నెల 30న జరగనున్న పాలిసెట్-25 పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ కె.సత్తిబాబు తెలిపారు. కాలేజీలో సంబంధిత అధికారులు, సిబ్బందితో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెందుర్తి పాలిటెక్నిక్ కాలేజీ పరిధిలో ఐదు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని, 2632 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉందని తెలిపారు. పరీక్షల కోసం ఆరుగురు అబ్జర్వేటర్లు, ఇద్దరు రూట్ ఆఫీసర్లను నియమించినట్లు చెప్పారు. విద్యార్థులు ఉదయం 9:30 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, 11 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలకు అనుమతించబోమని స్పష్టంచేశారు. ఈ నెల 30వ తేదీన సింహాచలం చందనోత్సవం జరుగుతున్నందున రద్దీ దృష్ట్యా విద్యార్థులు ముందుగానే బయలుదేరి సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

అనంత పద్మనాభ స్వామి పునఃప్రతిష్ఠకు చురుగ్గా పనులు

ప్రజాశక్తి -పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభం గ్రామంలోని శ్రీ అనంత పద్మనాభ స్వామి కొండపైన పునఃప్రతిష్ఠ కార్యక్రమం పనులు ఎంపిపి రాంబాబు ఆధ్వర్యాన చురుగ్గా సాగుతున్నాయి. మే 5 నుండి 9వ తేదీ వరకు జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపిపి కోరారు. ఈ కార్యక్రమంలో నానాజీబాబు, సీతారామాంజనేయులు, పవన్‌కుమార్, అచ్చంనాయుడు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలని పోర్టు యూనియన్ నాయకులు కె.సత్యనారాయణ డిమాండ్‌చేశారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 210వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హాస్పిటల్ ప్రయివేటీకరణపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్పందించాలన్నారు. హాస్పిటల్ టెండర్‌కు వచ్చిన వారిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ప్రైవేటీకరణ నిర్ణయం అనైతికమన్నారు. కార్మికుల కృషితోనే హాస్పిటల్ అభివృద్ధి సాధ్యమైందన్నారు. సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రయివేటుకు అప్పగించడం అనర్థమన్నారు. టెండర్ మే5కి వాయిదా వేయడం కాదు పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. ప్రయివేటీకరణ కొనసాగితే, కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జె.సత్యనారాయణ, జిసిహెచ్.నాయుడు, బి.జగన్, కనకారావు, ఈశ్వరరావు, నాయుడు, రాజగోపాల్ రాఘవులు, కెఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం మెయిన్ రోడ్‌లో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతిచెందిన 89వ వార్డు ఎర్రచెరువుకు చెందిన ఒమ్మి వెంకట బాలాజీ (25) కుటుంబానికి ఆర్థిక సహాయం అందింది. వెంకట బాలాజీకి తెలుగుదేశం పార్టీ సాధారణ సభ్యత్వం ఉండటంతో బీమా కింద రూ.5 లక్షలను బాధిత కుటుంబానికి ప్రభుత్వ విప్ గణబాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి రంగనాయకులు, 89వ వార్డు అధ్యక్షులు బొడ్డేటి విజయకుమార్, దాడి సురేష్, బొడ్డేటి రమేష్, శరగడం రవి, బుడుమూరి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ మౌలిక వ్యవస్థలపై బిజెపి దాడి

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి-సీతమ్మధార : రాజ్యాంగ మౌలిక వ్యవస్థలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దాడిచేస్తోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం పేర్కొన్నారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యాన సోమవారం పౌరగ్రంథాలయంలో 'మత స్వేచ్ఛ, భారత రాజ్యాంగం' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.చిరంజీవి, డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో లోకనాథం మాట్లాడుతూ, భారత దేశ లౌకిక విధానం ప్రకారం ప్రజలు మతస్వేచ్ఛ కలిగివుండాలని, ప్రభుత్వం ఏ మతాన్నీ ప్రోత్సహించరాదని తెలిపారు. కానీ కేంద్ర ప్రభుత్వం దానికి భిన్నంగా వ్యవహరించి లౌకిక వాదానికి హాని కలిగించేలా పనిచేస్తోందని పేర్కొన్నారు. భారత దేశ ప్రజలందరూ ఐక్యంగా ఎదిరించే విధంగా మనం కృషిచేయాలని పిలుపునిచ్చారు. భారత దేశంలో సామాజిక న్యాయం అమలు చేయడం ఇష్టంలేని బిజెపి ప్రభుత్వం ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటు పరం చేస్తుందన్నారు.

దళితహక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జెవి.ప్రభాకరరావు మాట్లాడుతూ, ఆర్‌ఎస్‌ఎస్ ముసుగులో హిందూవాదాన్ని ఈ లౌకిక రాజ్యాంగంలో బలవంతంగా రుద్దాలనే ప్రయత్నాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగాన్ని ప్రక్కనబెట్టి బిజెపి పాలకులు మనుస్మృతిని ప్రవేశ పెట్టాలనే ప్రయత్నాలు మొదలుపెట్టారని తెలిపారు. అలీగడ్ పర్యటనలో మోహన్ భగవత్ 'ఒకే గుడి, ఒకే బావి, ఒకే శ్మశాన వాటిక అనే సూత్రానికి దేశంలో ప్రజలు కట్టుబడి ఉండాలి' అని పిలుపునివ్వడం మనుస్మృతిని ప్రవేశపెట్టే కుట్ర అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాను ముందుకు తీసుకురావడం భారతదేశ లౌకికవాదానికి, ముస్లిం, క్రిస్టియన్ తదితర మైనారిటీ ప్రజలకు తీరని నష్టం కలిగిస్తుందని, దీన్ని ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బన్న, రాష్ట్ర నాయకులు భాగంలక్ష్మి, డిహెచ్‌పిఎస్ నాయకులు, క్రిస్టియన్ ఫాదర్ మాట్లాడారు. మైనారిటీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

పూర్వ విద్యార్థులు - ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి -గాజువాక

చైతన్య ఇంగ్లీషు మీడియం స్కూల్ 2010-11 పదవ తరగతి విద్యార్థులు 'ది యూనియన్' రివైండ్, రిలివ్, రికనెక్ట్ పేరుతో ఆత్మీయ కలయిక సోమవారం ఏర్పాటుచేశారు. పెదగంట్యాడ ఆటోనగర్లో ఏర్పాటుచేసిన ఈ ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా పాఠశాల మాజీ కరస్పాండెంట్, ప్రస్తుత సంస్కృతి గ్లోబల్ స్కూల్ ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి, డైరెక్టర్ ఉదయనాగశ్రీ హజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తాము నడిపిన విద్యా సంస్థలో చదువుకున్న పిల్లలను, మాతో కలిసి పనిచేసిన ఉపాధ్యాయులను చూడడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ పూర్వానుభవాలను గుర్తు చేసుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

30న ఉద్యోగ విరమణలు

ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ

తగరపువలస : భీమిలి మండలం, సింగనబంద గ్రామ పంచాయతీ, కృష్ణంరాజు పేట మండల పరిషత్ ప్రాథమికో న్నత పాఠశాలలో హెచ్ఎంగా పనిచేసిన గొట్టిపల్లి సత్య నారాయణ ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందనున్నారు.

ఉద్యోగ ప్రస్థానం ఇలా..

1998 ఆగస్టు 17వ తేదీన ఉమ్మడి విశాఖ జిల్లా ముంచంగిపుట్టు మండలం, పేటమాలిపుట్టు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. అదే మండలం కిలగాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002 వరకు ఇంగ్లీష్ బోధించారు. 2002 నుంచి 2009 వరకు పద్మనాభం మండలంలోని దువ్వపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, 2009 నుంచి 2017 వరకు అదే మండలం సామయ్యవలస, 2017 నుంచి 2025 వరకు భీమిలి మండలం సింగన బంద పంచాయతీ, కృష్ణంరాజుపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేశారు. ఇదే పాఠశాలలో 2023లో హెచ్ఎంగా ఉద్యోగోన్నతి పొందారు. 2023 నుంచి 2025 వరకు హెచ్ ఎంగా ఉంటూ ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందనున్నారు. 27 ఏళ్ల ఉద్యోగ నిర్వహణ తనకు ఎంతో సంతృప్తి నిచ్చిందని ఆయన అన్నారు.

విద్యా భ్యాసం ఇలా...

సత్యనారాయణ స్వగ్రామం తగరపువలస. 1 నుంచి 5వ తరగతి వరకు ప్రైవేట్ పాఠశాలలో, 6 నుంచి 10వ తరగతి వరకు చిట్టివలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివారు. భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. విజయనగరం మహారాజా డిగ్రీ కళాశాలలో బి.కామ్, ఆంధ్రా యూనివర్సిటీలో ఎంకామ్, ఆళ్వార్ దాస్ లా కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ లా పూర్తి చేశారు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ నుంచి ఎంఎ ఇంగ్లీష్, తమిళనాడు, అన్నామలై యూనివర్శిటీ నుంచి బిఇడి పూర్తి చేశారు.

ఎన్నో అవార్డులు...

వరుసగా మూడేళ్ల పాటు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో పాటు మదర్ థెరీసా ఫౌండేషన్, లయన్స్ క్లబ్, చిట్టివలస శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యానఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందారు. రచయితగా ఎన్నో జానపద గేయాలు, పాటలు రాశారు. 'ఒక దివ్వె వెలిగించు వేవేల దీపాలు', సమయస్ఫూర్తి, కనువిప్పు, మేలు కొలుపు, మార్పు వంటి ఎన్నో నాటకాలను రంగస్థలంపై స్వీయ రచన, దర్శకత్వంతో పాత్రలు పోషించి పలువురి ప్రశంసలు పొందారు.

విద్యా శాఖ మాస పత్రికకు రచయితగా ఎన్నో వ్యాసాలు రాశారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారు చేసిన అనుభవం ఉంది. శ్రీ సత్య సాయి సేవా సంస్థల ఆధ్వర్యాన జరుగుతున్న అనేక సేవా కార్యక్రమాల్లో ఇతను చురుగ్గా పాల్గొంటున్నారు. 1986 నుంచి 1998 వరకు శ్రీ విద్య కామర్స్ ఇనిస్టిట్యూట్ నిర్వహించారు. అకౌంట్స్, కామర్స్, ఇన్ కంటాక్స్, కాస్టింగ్, మేనేజ్‌మెంట్, స్టాటిస్టిక్స్‌పై బోధించే వారు. ఈ ఇనిస్టిట్యూట్ నిర్వహణతో విద్యార్థికుల్లో మంచి పేరు సంపాదించారు. స్వతహాగా సేవా తత్పరులు. తొలిసారి ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఉమ్మడి విశాఖ జిల్లా ముంచంగిపుట్టు మండలం, పేట మాలి పుట్టులో ఇతని వద్ద చదువుకున్న వారిలో ఎందరో ఉపాధ్యాయులుగానూ, బ్యాంక్ అధికారులుగానూ, ఇతర రంగాల్లో ఉన్నత ఉద్యోగాల్లో ఇప్పటికే స్థిరపడ్డారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ బివి.రామారావు

గాజువాక : జివిఎంసి గాజువాక జోనల్ కార్యాలయంలో సీనియర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బివి.రామారావు ఈ నెల 30వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు. గాజువాక పంచాయతీలో 1987లో శానిటరీ మేస్త్రిగా చేరారు. 1998 ఆగస్టు 30న పర్మినెంట్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఉత్తర్వులు అందుకున్నారు. 2002 నుంచి 2014 సంవత్సరం వరకు భీమునిపట్నం, అనకాపల్లి మున్సిపాల్టీల్లో చేశారు. 2014 సంవత్సరంలో గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ బాధ్యతలు చేపట్టారు. 56, 57, 79, 85 వార్డుల్లో బాధ్యతలు నిర్వహించారు. అగనంపూడి ఏరియాలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. 2022లో 70వ వార్డు ఇన్‌ఛార్జి శానిటరీ సూపర్‌వైజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 30 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకుని ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి వైవి.రత్నారావు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ సిఎంఎం విభాగం సీనియర్ మేనేజర్ వైవి.రత్నారావు ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. కాకినాడలో జన్మించిన ఆయన పదో తరగతి వరకు మున్సిపల్ హైస్కూల్లో చదివారు. ఆ తర్వాత కాకినాడ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో పూర్తి చేశారు. 1980 సంవత్సరంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ట్రైనీగా ప్రవేశించారు. 1990 సంవత్సరంలో ఛార్జిమెన్‌గా ఉద్యోగం పర్మినెంట్ అయింది. 1999 సంవత్సరంలో ఆఫీసర్‌గా, ప్రస్తుతం సీనియర్ మేనేజర్‌గా ఉన్నారు. 1990లో సిఐటియులో చేరారు. సిఐటియు చేసే అన్ని పోరాటాల్లో పాల్గొన్నారు. స్టీల్‌వర్కర్ పత్రికకు ఎడిటోరియల్ బోర్డు మెంబర్గా పనిచేశారు. జవహర్‌లాల్ నెహ్రూ అవార్డు, గ్రీన్ అవార్డులను సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం జనవిజ్ఞాన వేదిక సభ్యునిగా కొనసాగుతున్నారు. గతంలోగా జన విజ్ఞాన వేదికలో అనేక పదవులు నిర్వర్తించారు. సైన్సును అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు.

హైస్కూల్ పీడీ మన్నాజీ...

గాజువాక : కణితి జిల్లా పరిషత్ హైస్కూల్ పీడీ ఎం.మన్నాజీ ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆయన విశాఖ నగరం దొండపర్తిలో జన్మించారు. పదో తరగతి వరకు రైల్వే స్కూల్లో చదివారు. బుల్లయ్య కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తిచేశారు. ఆయన ఎనిమిదో తరగతి చదువుతుండగా స్టేట్ స్కూల్ గేమ్స్‌లో పాల్గొని అండర్ 14, 16, 19 జోనల్ లెవల్‌లో బహుమతులు అందుకున్నారు. పొద్దుటూరులో బిపిఇడి పూర్తి చేశారు. గుజరాత్ గాంధీనగర్లో ఎంపిఇడి, ఎన్ఐఎస్‌ను పూర్తి చేశారు. 2002లో ఉద్యోగంలో చేరారు. 2004వ సంవత్సరంలో ప్రమోషన్ పొందారు. ఆంధ్ర క్రికెటర్ అసోసియేషన్‌కు జూనియర్ పానెల్ కోచ్‌గా, అండర్ 14ట డిస్ట్రిక్ట్ కోచ్‌గా, స్టేట్ కోచ్ సెలక్షన్ కమిటీ మెంబర్‌గా తొమ్మిది సంవత్సరాలు చేశారు. ఇప్పుడు క్రికెట్ ఆడుతున్న తుంగ్లాంకు చెందిన నితీష్ కుమార్, భరత్ ఈయన ఆధ్వర్యంలోనే కోచింగ్ పొందారు. నక్కపల్లి, తగరపువలస, అడవివరం పాఠశాలల్లో పనిచేశారు.

మేడేను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-పరవాడ

మే నెల 1వ తేదీ మేడే వేడుకలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మే డే సన్నాహక సమావేశం సోమవారం పరవాడలో జరిగింది. ఈ సందర్భంగా గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికుల ప్రాణ త్యాగాలతో 8 గంటల పని సాధించిన ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను కార్మికులందరూ పతాకావిష్కరణలు చేయాలని పిలుపునిచ్చారు. అలాగే సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం దొంగచాటుగా కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని తెలిపారు. దీనిని మార్చి అమలు చేయడం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. దీనిని నిరసిస్తూ దేశంలో ఉన్న అన్ని కార్మిక, రైతు సంఘాలు మే 20 తేదీన దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వివి రమణ, ఎం సంతోష్ కుమార్, వై బాబురావు, ఆర్ శంకర్‌రావు, పెంటారావు, పైడ్రాజు, రాజుతదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి : కార్మికుల బలిదానాలతో 8 గంటల పని సాధించిన ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను ఘనంగా నిర్వహించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ . శంకరరావు పిలుపునిచ్చారు. ఆయన సోమవారం యలమంచిలి అలువేలు మంగ స్కూలు వద్ద మండల కార్యదర్శి సిహెచ్ శివాజీ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం జరిగింది. కార్మికులు పోరాడి సాధించుకొన్న హక్కుల్ని మోడీ సర్కారు లేబర్ కోడ్స్‌ను ఉల్లంఘిస్తోందని దుయ్య బట్టారు. రైతు సంఘాలు మే 20 న చేపట్టే దేశ వ్యాప్త సమ్మెకు ప్రజలంతా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో బి.శశికళ, పి.జానకి, కూర్మారావు, డి.రాజు, వరలక్ష్మి, కొండలరావు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

విశాఖ కలెక్టరేట్ : మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల రక్షణ కోసం ఉధృతమైన పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పిలుపునిచ్చారు. విశాఖ జిల్లాలో మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ జగదాంబ సిఐటియు కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కుమార్, కెఎం. జ్యోతీశ్వరరావు

మేడే సంబరాలను మే 1 నుంచి 7 వరకు వారం రోజులు పాటు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. 1న ఉదయం 9.30 గంటలకు దొండపర్తి డిఆర్ఎం ఆఫీస్ నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు కార్మిక ప్రదర్శన, అనంతరం సభ జరుగుతయన్నారు. ఈ సందర్భంగా కార్మికులకు పని ప్రదేశాలలో, నివాస ప్రాంతాలలో ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 2, 3 తేదీలలో రక్తదాన శిబిరాలను నిర్వహిస్తామన్నారు. కార్మికుల కుటుంబ సభ్యులతో కలిసి మేడే ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. మే 20న జరుగుతున్న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

ఎంవిపి.కాలనీ : మే 1న సిఐటియు మద్దిలపాలెం జోన్ కమిటీ నాయకత్వంలో 40 చోట్ల పతాకావిష్కరణలు చేయాలని నిర్ణయించారు. సంఘం జోన్ కమిటీ విస్తృత సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌కెఎస్‌వి. కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, డి.అప్పలరాజు, జెఆర్.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న సిఐటియు నేతలు

పీలా శ్రీనును అభినందిస్తున్న పరవాడ టిడిపి నాయకులు

జివిఎంసి మేయర్ పీలాకు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి-అనకాపల్లి, అనకాపల్లి రూరల్

జీవీఎంసీ నూతన మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావుకు అభినందనలు వెల్లువెత్తాయి. మేయర్‌ను ఏపి రాష్ట్ర అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, 82, 83 టిడిపి ఇన్చార్జులు పోలారపు త్రినాథ్, బొద్దపు ప్రసాద్, అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆకుల నానాజీ, కర్రి సుబ్రహ్మణ్యం, ఎస్ భానుచందర్ (అఖి) దీనబంధు తదితరులు పాల్గొన్నారు

పరవాడ : జివిఎంసి మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాస్‌రావుకు పరవాడ మాజీ జెడ్పిటిసి పైల జగన్నాధరావు, సోమవారం అభినందనలు తెలిపారు. మాజీ జడ్పిటిసి మాధం శెట్టి నీలబాబు, మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్నా కలిసి పుష్ప గుచ్ఛం సాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో సాలాపు మోహన్, కూండ్రపు శ్రీరామ్మూర్తి, వర్రి వసంత రావు పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి మేయర్‌గా నూతనంగా ఎన్నికైన పీలా శ్రీనివాసరావుకు 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతసత్యనారాయణ అభినందనలు తెలిపారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువతో సత్కరించారు.

గంజాయి కేసులో పదేళ్ల జైలు

ప్రజాశక్తి -అనకాపల్లి, చోడవరం : అక్రమ గంజాయి రవాణా కేసులో ముద్దాయికు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు లక్ష రూపాయలు జరిమానా విధిస్తూ చోడవరం 9వ అదనపు సెషన్స్ కోర్టు తీర్పునిచ్చినట్టు ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 6 నెలల సాధారణ జైలు శిక్ష విధించనున్నట్లు గౌరవ కోర్టు ప్రకటించిందన్నారు. కేసు వివరాలను ఎస్పి తెలియజేశారు. చీడికాడ మండలం బైలపూడి గ్రామానికి చెందిన జాజి మొగ్గల సంతోష్, గంజి మరిడి బాబు, జాజిమొగ్గల దేముడు 2015 డిసెంబర్ 28న చీడికాడ పోలీస్ స్టేషన్ పరిధి జి కొత్తపల్లి శివారు ప్రాంతంలో 100 కేజీల గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా చీడికాడ ఎస్సై ఏ కోటేశ్వరరావుకు పట్టుపడ్డారు. వారిని అదుపులోకి తీసుకొని వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. నేరం రుజువు కావడంతో కోర్టు ముద్దాయిలు ఒక్కొక్కరికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తోపాటు లక్ష రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ, జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పినట్టు ఎస్పీ తెలిపారు.

పునశ్చరణ, నమూనా పరీక్షలకు ప్రాధాన్యతనివ్వాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు పునర్చరణ, నమూనా పరీక్షలకు ప్రాధాన్యత ఇవ్వాలని సివిల్స్ విజేత డాక్టర్ రావాడ సాయిమోహిని మానస సూచించారు. సోమవారం అనకాపల్లి గౌరీ గ్రంథాలయాన్ని సందర్శించారు. పోటీ పరీక్షల ఔత్సాహికులతో మాట్లాడుతూ స్వయం శ్రద్ధ, మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రేరణ ఉండి ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదివితే పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చున్నారు. పరీక్షల్లో సమయ నిర్వహణ సద్వినియోగం, వేగం కీలకమని, ఇందుకోసం అభ్యర్థి రోజుకు ఒకట్రెండు ఆన్‌లైన్ నమూనా పరీక్షలు రాసి స్వీయవిశ్లేషణ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు పట్టున్న సబ్జెక్టులు, బాగా చదివిన అధ్యాయాలపై పరీక్ష తేదీ చివరి రోజుల్లో దృష్టి సారించాలన్నారు. ఒత్తిడి లేకుండా పరీక్ష రాయాలన్నారు.ఆచరణాత్మక అలవాట్లు విఫలమైనప్పుడు స్వీయ విశ్లేషణ అత్యవసరమన్నారు. ఇది పోటీపరీక్షలకే కాకుండా, నిజ జీవితానికి వర్తిస్తుందన్నారు. భాష కన్నా కంటెంట్‌పైన విద్యార్థులు దృష్టి పెట్టాలన్నారు. గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ, గ్రంథాలయంలో భవిష్యత్‌లో సివిల్స్ శిక్షణ ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గౌరీ గ్రంథాలయం అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, కాండ్రేగుల సత్యనారాయణ (ఎస్ఎఫ్ఐ), మాజీ కార్యదర్శి మళ్ళ బాపునాయుడు, కాండ్రేగుల జగ్గారావు, బొడ్డేడ జగ్గఅప్పారావు పాల్గొన్నారు. అనంతరం సివిల్స్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 975వ ర్యాంకు సాధించిన డాక్టర్ మానసను సత్కరించారు.

బ్లాక్ స్టోన్ క్వారీ, క్రషర్ యూనిట్ల ఆకస్మిక తనిఖీ

క్వారీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మండలం, మార్టూరు గ్రామ పంచాయతీ పరిధిలోని క్వారీ, స్టోన్ క్రషర్ యూనిట్లను ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్వారీ, స్టోన్ క్రషర్ యూనిట్లలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, ప్రతి క్వారీ, క్రషర్ యూనిట్ వద్ద హెచ్చరిక బోర్డులు (సేఫ్టీ బోర్డులు) ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతీ క్వారీ, స్టోన్ క్రషర్ యూనిట్ల దగ్గర అక్కడకి వెళ్లగానే అది ఎవరిదో అందరికీ తెలిసేలా, సరిహద్దులు నిర్ణయిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మైన్స్ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో జాయింట్‌గా ఇన్స్పెక్షన్ చేసి నియమ నిబంధనలు పాటించని వారి మీద, భద్రత ప్రమాణాలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన యూనిట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధితో పాటు ప్రజల ప్రాణ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం అనివార్యమని ఎస్పీ చెప్పారు. ఆయన వెంట అనకాపల్లి రూరల్ సిఐ జి.అశోక్ కుమార్, ఎస్సై జి.రవికుమార్ ఉన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించాలి

2 నుండి పోరాటానికి సిద్ధం కావాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

గర్భిణులు, బాలింతలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతున్న 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఉమ్మడి విశాఖపట్నం జిల్లా విస్తృత సమావేశం సోమవారం అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈసందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవి ప్రసాద్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు, కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడారు. 10 ఏళ్ళుగా కనీస వేతనాలు లేక, ఉద్యోగ భద్రత వంటి సమస్యల పరిష్కారం కాకుండా ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం చేయాలని మే రెండో తేదీ నుంచి పోరాటానికి ఉద్యోగులందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా అరవిందో కంపెనీ నిర్వహిస్తున్న ఈ వెహికల్స్ మే నెల చివరికి కాంట్రాక్ట్ ముగుస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం కొత్త కాంట్రాక్టు ఇవ్వబోతున్న నేపథ్యంలో వచ్చే కంపెనీ కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత వంటి చర్యలు తీసుకోవాలని తదితర డిమాండ్లపై ఈ పోరాటానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగరావు, శ్రీను, నాయుడు, ఉమ్మడి విశాఖ జిల్లా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముగిసిన నూకాంబిక జాతర

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని గవరపాలెం నూకాంబిక కొత్త అమావాస్య జాతర, రాష్ట్ర పండగ ఉత్సవాలు ఆదివారం రాత్రితో ముగిసాయి. ముగింపు వేడుకలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పాల్గొని, కళాకారులు బహుమతులు అందజేశారు. నిర్వాహకులకు చిరు సత్కారం చేశారు. నూకాంబిక జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన తర్వాత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పర్యవేక్షణలో నెలరోజులపాటు ప్రతిరోజూ వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు ఐదు వేలమంది కళాకారులు పాల్గొని ప్రదర్శనలిచ్చి ప్రజలను అలరించారు. ముగింపు రోజున టెన్త్ పరీక్షల్లో టాపర్స్‌గా నిలిచిన షేక్ రిజ్వాన పర్వీన్, అరిసి వెంకటజయ, ఎంఢ అనిషా, పంపాన మౌనికలను సత్కరించారు.. శ్రీకాకుళం శివశ్రీ నృత్య కళానికేతన్ కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. కాండ్రేగుల శ్రీరామ్ ఆధ్వర్యంలో ప్రధాని మోడీ మెచ్చిన హైదరాబాద్ కవల సోదరులు గరినే సాయికుమార్, గరినే సంతోష్‌కుమార్ శివతాండవం ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది.. 450 మంది భక్తులతో అఖండ హారతి ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, నూకాంబిక దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్లబాబు), ఆలయ సహాయ కమిషనర్ వెంపల రాంబాబు, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్ పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకరరావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి ఎర్రవరపు లక్ష్మి , నిర్వాహకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి, సకల గోవిందరావు, గండేపల్లి మురళి పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత పాలిసెట్ శిక్షణ

ప్రజాశక్తి- కశింకోట : స్థానిక ఆర్ఇసిఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో నెల రోజులపాటు నిర్వహించిన ఉచిత పాలిసెట్ శిక్షణా తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్. బి.ఉమా శంకర్ మాట్లాడుతూ, ఉచిత శిక్షణకు 206 మంది విద్యార్థులు హాజరయ్యారని, వారికి పాలిసెట్‌కు అవసరమైన సూచనలతోపాటు స్టడీ మెటీరియల్ కూడా ఉచితంగా అందజేశామన్నారు. పాలిసెట్‌కు సన్నద్ధతలో భాగంగా మాక్‌టెస్ట్ నిర్వహించామని, అందులో అత్యధిక మార్కులు సాధించిన పి. గౌతం, ఒమ్మి కవిత ఎం. భవానీ శంకర్ ముగ్గురికి బహుమతులను జనరల్ సెక్షన్ విభాగాధిపతి ఎస్.గణేష్, ఫిజిక్స్ సీనియర్ లెక్చరర్ వీరేంద్ర, కెమిస్ట్రీ లెక్చరర్ మదీనా, మ్యాథ్స్ లెక్చరర్ సురేష్ అందించారన్నారు.. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ విభాగాధిపతి రమణ కుమార్, ఇంగ్లీష్ సీనియర్ లెక్చరర్ జగన్మోహిని, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ బకాయిలు చెల్లించాలి

ఎపి రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులకు, కార్మికులకు పూర్తి బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ పోరాట కమిటీ, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలోనే సహకార రంగంలో నడుస్తున్న ఏకైక సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఆదుకోకుండా దాని భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మార్చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుగర్ ఫ్యాక్టరీ లేకపోతే చోడవరం పరిసర ప్రాంతాల్లో 11 మండలాలు ప్రజలకు చెరుకు ప్రత్యామ్నాయ లేక రైతులు కార్మికులు రోడ్డున పడతారన్నారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కి చెరకు సరఫరా చేసిన రైతులకు ఇవ్వాల్సిన పూర్తి బకాయిలన్నీ వెంటనే చెల్లించాలన్నారు. వచ్చే సీజన్లో ఫ్యాక్టరీ నడుస్తుందో లేదో అని అనుమానంతో ఈ ప్రాంత రైతాంగం ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వం వెంటనే వచ్చే సీజన్ కోసం స్పష్టమైన ప్రకటన చేసి రైతులకు విత్తనాలు, ఎరువులు పురుగుమందులు అందించాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ ఓవరాలింగ్ సంబంధించిన నిధులను గ్రాంట్‌గా మంజూరు చేయడంతో పాటు ఫ్యాక్టరీ ఆధునీకరణకై ప్రభుత్వం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకై ప్రభుత్వం చొరవ చూపకపోతే భవిష్యత్తులో రైతాంగం, కార్మికులతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, నాగిరెడ్డి సత్యనారాయణ ,తాతబాబు, జగ్గప్పారావు, నాయుడు, తాతారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్పందన కార్యక్రమంలో ఆర్డీవోకి వినతిపత్రం అందజేశారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతు నాయకులు

ఉపాధి వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి -మునగపాక

ఉపాధి హామీ కార్మికుల వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని సిఐటియు మండల కార్యదర్శి ఎస్ బ్రహ్మాజీ డిమాండ్ చేశారు.సోమవారం స్థానిక పరిషత్ కార్యాలయం వద్దఉపాధి కూలీలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఎంపిడిఒ ఉషారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పనిచేసినా కూలీడబ్బులు అందకపోవడంతో ఉపాధి కూలీలు ఆర్థికంగా ఇబ్బంది పడే పరిస్థితి ఉందన్నారు. ప్రతివారం పేస్లిప్పులు ఇవ్వడం లేదని, కొలతలు లేకుండా రోజుకూలీ రూ.307 చెల్లించాలన్న ప్రభుత్వ ప్రకటన అమలుకు నోచలేదని మండిపడ్డారు. పనిప్రదేశంలో టెంట్, తాగునీరు, మెడికల్ కిట్లు వంటి సౌకర్యాలు లేవని, గతంలో మాదిరిగా ఉచిత పనిముట్లు, వేసవి అలవెన్స్ ఇవ్వడం లేదన్నారు. ఉపాధి కూలీలకు రూ.ఐదు లక్షల ప్రమాదబీమా చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఉపాధి కార్మికులు వేగి శివ, దాడి భాస్కరరావు, గోవిందా, సూరిబాబు, గాలి అప్పారావు, టెక్కలి చిన్న సూరి అప్పారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పరవాడ

మండల కేంద్రం పరవాడలో రూ.పది లక్షల ఎంపిటిసి నిధులతో సిసి డ్రెయిన్, కాలువల నిర్మాణ పనులకు సోమవారం స్థానిక ఎంపిటిసి, రాష్ట్ర సిఐసి సభ్యులు పైల శ్రీనివాసరావు, పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరుచేసిన ఎంపిపి పైల వెంకట పద్మలక్ష్మికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పరవాడ పెద్దచెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, టిడిపి అధికార ప్రతినిధి పైల రామ చంద్రరావు, బొద్దపు అయ్యబాబు, రెడ్డి నగేష్, బద్రి, వద్రి హరి, రొంగలి కన్నబాబు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభకు లయన్స్ ప్రోత్సాహం

ప్రజాశక్తి-చోడవరం, చోడవరం రూరల్ : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను లయన్స్ క్లబ్ చోడవరం శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. లయన్స్ క్లబ్ చోడవరం శాఖ అధ్యక్షులు డాక్టర్ నీలం నాగేంద్రబాబు, ఉపాధ్యక్షులు పసుమర్తి సాంబశివరావు, క్లబ్ కార్యవర్గ సభ్యులు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రూ.లక్ష నగదు ప్రోత్సాహంతోపాటు జ్ఞాపికలు బహూకరించి, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో లక్ష్మీపురం ఉపసర్పంచ్ ఆది గణపతినాయుడు, ఎంఇఒ సింహాచలం, పాఠశాల హెచ్ఎం ఎవి జగన్నాథరావు, లయన్స్ క్లబ్ సర్వీసెస్ చైర్పర్సన్ ముక్కా రమేష్, ఎల్‌సిఐఎఫ్ చైర్పర్సన్ డాక్టర్ పూసర్ల శకుంతలరావు, మార్కెటింగ్ చైర్పర్సన్ నల్లమిల్లి గనిరెడ్డి, ఉగ్గిన నాగబాబు, వేపాడ సత్యనారాయణ, సుంకర సత్యనారాయణ, వజ్ర రమణమూర్తి (వాణి బాబు) పాల్గొన్నారు

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి-చోడవరం, చోడవరం రూరల్

ఇటీవల విడుదలైన టెన్త్ పరీక్ష ఫలితాల్లో మండలంలోని 14 ప్రభుత్వ, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలలో అత్యధిక మార్కులతో ప్రతిభ చాటిన 16 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సోమవారం మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఎంఇఒలు బి.పడాలదాస్, కె. సింహాచలం ఇతర సిబ్బంది సత్కరించారు.ఈ సందర్భంగా అభినందన సభలో ఎంఇఒలు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించారన్నారు. పిల్లల విజయాలలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉందన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులంతా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని, నిరంతరం చదువులో నూతన నైపుణ్యాలను, వ్యక్తిత్వ వికాసాన్ని సాధిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, రవిశంకర్, శిరీషా, నాగలక్ష్మి, కెవిఎం.నాయుడు, సరోజిని, భూలక్ష్మి, చంద్రిక, సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించిన దృశ్యం

రియల్టర్ ఆత్మహత్య

ప్రజాశక్తి-దేవరాపల్లి

విశాఖకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నడింపల్లి సత్యనారాయణరాజు (70) దేవరాపల్లి మండలం మామిడిపల్లిలోని రిసార్ట్లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే తాను బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు ఆత్మహత్యకు ముందు ఆయన రాసిన స్వీయ మరణధ్రువపత్రాన్ని పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. మృతుడి భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్చార్జ్ ఎస్ఐ ఆర్.ధనుంజయ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.... విశాఖ నగరంలోని సీతమ్మధారకు చెందిన నడింపల్లి సత్యనారాయణరాజు 40 సంవత్సరాల నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారంలో కొంత మంది నుంచి తనకు రావలసిన బకాయిలు రూ.కోట్లకు పేరుకుపోవడంతో ఆయన వ్యాపారంలో బాగా నష్టపోయారు. దేవరాపల్లి మండలం మామిడిపల్లిలోని రిసార్ట్‌కి అప్పుడప్పుడు వచ్చి, ఇక్కడ ఒక రోజు ఉండి మరలా వెళ్లిపోయే వారు. ఆదివారం ఉదయం 10.30 గంటల సమయంలో రిసార్ట్‌కి వచ్చిన ఆయన మధ్యాహ్నం, రాత్రి భోజనం చేశారు. సోమవారం ఉదయం 6 గంటల సమయంలో రిసార్టు మేనేజరు రాయి శివ నిద్ర లేచి చూసే సరికి గది బయట ఉన్న ఉయ్యాల కొక్కానికి తాడు కట్టి సత్యనారాయణరాజు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించారు. ఈ విషయాన్నిదేవరాపల్లి పోలీసులకు, మృతుడి బంధువులకు సమాచారం అందించాడు. వెంటనే ఘటన స్థలానికి హెచ్‌సి బి.ప్రకాశరావు చేరుకుని రియల్టర్ బలవన్మరణానికి పాల్పడిన గదిని నిశితంగా పరిశీలించారు. ఆయన చనిపోయే ముందు తన మనోవేదనతో పాటు తనకు రావలసిన బకాయిలు, తాను ఇవ్వవలసిన బకాయిల గురించి ఆరుగురు వ్యక్తులకు విడివిడిగా రాసిన ఉత్తరాలు పోలీసులు కనుగొని, వాటిని స్వాధీనం చేసుకున్నారు. తాను పిరికితనంతో ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ ఆ ఉత్తరాల్లో స్వయంగా రాశారు. తమ రిసార్ట్‌కి వచ్చినపుడల్లా తీవ్రంగా మథనపడుతూ ఏడ్చేవారని రిసార్ట్‌లో పనిచేస్తున్న సిబ్బంది పోలీసులకు తెలిపారు. మృతుడికి భార్య విజయలక్ష్మి, కుమారుడు సాయి చైతన్య వర్మ ఉన్నారు. కాగా ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్చార్జ్ ఎస్ఐ ధనుంజయ్ తెలిపారు.

4న వైసిపి కార్యాలయం ప్రారంభానికి తరలిరావాలి

ప్రజాశక్తి-పరవాడ : మే నెల 4వ తేదీన సబ్బవరం మండలంలో వైసిపి నియోజకవర్గ స్థాయి కార్యాలయం ప్రారంభించడం జరుగుతుందని, దానికి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. పరవాడ వైసిపి కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షులు కోన రామారావు అధ్యక్షతన సోమవారం జరిగిన మండల స్థాయి సమావేశంలో అదీప్ రాజ్ మాట్లాడుతూ నియోజకవర్గం కార్యాలయం ప్రారంభానికి శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి, పార్టీ జిల్లా పార్టీ అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, పార్లమెంటు పరిశీలకులు కరణం ధర్మశ్రీ హాజరుకానున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, వైసిపి నాయకులు చుక్క రామునాయుడు, వెన్నెల సన్యాసిరావు, పెదిశెట్టి శేఖర్, ధలాయి నదియా, గొర్లె గోపి అమ్ములు, బొండా కనకరావు, పెదమాషివాడ సర్పంచ్ పల్లా అప్పారావు, నాగమణి, గొర్లెవానిపాలెం ఎంపీటీసీ గొర్లె వరలక్ష్మి ఎరుకు నాయుడు, అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, సుందరపు అప్పారావు, గొన్నా హేమచంద్ నాయుడు పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించి ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేందుకు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు ఎస్.వి.ఎస్. సుబ్బలక్ష్మి, జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఏపీఐఐసి మనోరమ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణ రావు అర్జీలపై సమీక్ష నిర్వహిస్తూ ప్రజల నుండి వచ్చిన వినతులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని కోరారు.

విభిన్న ప్రతిభావంతుల అర్జీలను ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె.ఆర్.ఆర్.సి. ఎస్.వి.ఎస్.సుబ్బలక్ష్మి నేరుగా వారి వద్దకు వెళ్లి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో.....

ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హా ఫిర్యాదుదారుల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. చట్ట పరిధి లో ఫిర్యాదులను పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి -చోడవరం : వేసవిలో తాగునీటి కొరత లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. సోమవారం గండి కాలనీ, శివాలయం వీధిలో నాలుగు మంచినీటి బోర్లు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చోడవరం పట్టణ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి గాడి కాసులమ్మ, సర్పంచి సూకాలమ్మ, గూనూరు మల్లునాయుడు, గూనూరు పెదబాబు, రూపాదేవి, సకురు కోటేశ్వరరావు, దేవరపల్లి వెంకట అప్పారావు, మత్స్యరాజు, గండి మూర్తి, నాయుడు, పప్పు శ్రీను, ఎంపిడిఒ ఆంజనేయులు, ఇఒ నారాయణరావు పాల్గొన్నారు.

ఆర్.భీమవరంలో సమగ్ర సర్వే చేపట్టాలని వినతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని ఆర్.భీమవరం పంచాయతీలో ప్రభుత్వ, డి.ఫారం పట్టా భూములన్నీ సమగ్ర సర్వే చేపట్టాలని మాజీ సర్పంచ్ మలిరెడ్డి బుజ్జి, టిడిపి నేతలు వెలంకాయల అప్పలనాయుడు, వెలంకాయల గోవింద విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం వారు తహసీల్దార్ ఎం.లక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికే దీనిపై కలెక్టర్లో కూడా తాము వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. అన్ని భూములను సర్వే చేసి మిగులు భూములు ఉంటే స్థానిక పేదలకు పంపిణీ చేపట్టాలని కోరారు.

ఉద్యోగుల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ ఉద్యోగులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు డిఆర్ఓ సత్యనారాయణరావుకు వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానంలో ప్రభుత్వ ఉద్యోగాలు వేలాది మందికి ఇస్తామని ప్రకటించారని, దానికి అనుగుణంగా 2025వ సంవత్సరంలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందినటువంటి వారి పిల్లలు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలోనే చదవాలని చట్టం చేయాలని సూచించారు. లేకుంటే ప్రభుత్వ ఉద్యోగానికి అనర్హుడుగా ప్రకటించాలన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : సివిల్స్‌లో 975ర్యాంకు సాధించిన రావాడా సాయి మోహిని మానసను డాక్టర్ కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ట్రస్ట్ అధ్యక్షురాలు కొణతాల లక్ష్మీపార్వతి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత కొణతాల పణి భూషణ్ శ్రీధర్, యల్లపు సూరిప్పారావు, పెంటకోట ఉమామహేశ్వర రావు, మళ్ల జగదీష్, శైలజ, కాండ్రేగుల వెంకటరమణ, మైశెట్టి సత్తిబాబు, డాక్టర్ కొణతాల గణేష్, దూదిపల్లి కొండలరావు చౌదరి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్యభట్టలో ప్రాంగణ నియామకాలు

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ప్రాంగణ నియామకాలు జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. సుధీర్‌బాబు తెలిపారు. డెక్కన్ కెమికల్స్, ఎక్స్ టెక్సిస్ కంపెనీల వారు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలకు డిప్లొమా మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ సంబంధిత విద్యార్థులు 98 విద్యార్థులు హాజరయ్యారు. అందులో 36 మంది 2 కంపెనీలకు ఎంపికయినట్లు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు రజ్వంత్ సింగ్, సుప్రియ తదితరులు పాల్గొన్నారు. నేషనల్ కెరియర్ సర్వీస్ ప్రతినిధి యంగ్ ఫిషినల్ శ్యామ్ పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి

సిఎం, డిప్యూటీ సిఎం ఫొటోలతో చిన్నారుల నిరసన

ప్రజాశక్తి- చీడికాడ:మండలంలో కోనాం పంచాయితీ రెల్లలపాలెం గిరిజన గ్రామానికి రోడ్డు వేయాలని పవన్ కళ్యాణ్ మామయ్య, చంద్రబాబు తాతయ్యం ఫోటోల తో గిరిజన చిన్నారులు గ్రామంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం ఐదోవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరట. నరసింహమూర్తి మాట్లాడుతూ, చీడికాడ మండలంలో కోనాం పంచాయతీ రెల్లలపాలెం గిరిజన గ్రామానికి రోడ్డు, మౌలిక సదుపాయాలు లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారన్నారు. ఈ విషయమై 20-01-2025న అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసామని, తర్వాత సర్వే కోసం అధికారులు వచ్చి రోడ్డు మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తున్నామని తెలియజేశారన్నారు. రోడ్డు సదుపాయం లేక పోవడంతో చిన్న పిల్లలు అంగన్వాడి సెంటర్‌కు దూరం అయ్యారని తెలిపారు.డోలీ కట్టుకొని పది కిలోమీటర్లు కాలినడకన వెళ్ళవలసి వస్తుందని తెలిపారు. నిత్యావసర వస్తువులు తీసుకు రావడానికి దేవరాపల్లి 25 కిలోమీటర్లు, కోణం 10 కిలోమీటర్లు సంతలకు వెళ్లి భుజాలపై, తలపై మోసుకొని రావాల్సి వస్తుందన్నారు. అధికారులు స్పందించి తక్షణమే రెల్లలపాలెం గిరిజన గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించాలని నరసింహమూర్తి కోరారు చేశారు. ఈ కార్యక్రమంలో ఇరట ఈశ్వరమ్మ, కోట.గంగమ్మ, దాయిరి దేముడమ్మ, కోట.మల్లమ్మ, సోమల సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న నరసింహమూర్తి, చిన్నారులు

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం

నక్కపల్లిలో పాల్గొన్న సర్పంచ్, గ్రంథాలయాధికారి

ప్రజాశక్తి- మాడుగుల:వేసవికాలంలో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోపరుచుకోవాలని గ్రామ సర్పంచ్ యడ్ల కళావతి కోరారు. సోమవారం మాడుగుల శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి యడ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈనెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు 40 రోజులు పాటు గ్రంథాలయంలో ఈ వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు,ఆర్య వైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాదు శ్రీనివాసరావు, ఈవో మూర్తి బాబు, శానిటరీ ఇన్స్పెక్టర్ నారాయణరావు పాల్గొన్నారు.

నక్కపల్లి:పుస్తక పఠనంతో మేధస్సు పెంపొందుతుందని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే రంగబాబు అన్నారు. మండలంలోని చినదొడ్డుగల్లు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. మొదటి రోజు విద్యార్థులతో పుస్తక పఠనం, నీతి కథలను చదివించారు. ఈ కార్యక్రమంలో గోపాల రాజు తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ:స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎంఎస్ఎల్ జోగేశ్వరి, సర్పంచ్ సామాలమ్మ, మహిళా పోలీస్ రమాదేవి పాల్గొన్నారు.

కోటవురట్ల:శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు తెలిపారు. వివిధ అంశాలపై పోటీలను నిర్వహించే బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం ఉపాధ్యాయులు ప్రసాద్, మాజీ సర్పంచ్ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభమైంది. ముందుగ సరస్వతి దేవి చిత్రపటానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిని ఎం.పద్మావతి మాట్లాడుతూ ఈ శిబిరం ఈ నెల 28 నుండి జూన్ నెల6 వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులచే నీతి కథలు చదివించారు. ఈ కార్యక్రమంలో పాఠకులతోపాటు 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి స్థానిక వెటర్నరీ హాస్పిటల్ జూనియర్ వెటర్నరీ అధికారిణి సిహెచ్. కరుణ శ్రీ ప్రారంభించారు. కార్యమంలో గాయత్రి పాఠశాల ఉపాధ్యాయులు సిహెచ్. శాంతి, జె. అశ్విని గ్రంథాలయం అధికారి కాండ్రేగులు జగన్నాథం, పాఠకులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం సోమవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. మొదటిరోజు విద్యార్థులకు నీతి కథలు, దేశ నాయకుల చరిత్రకు సంబంధించిన పుస్తకాలను చదివించడం జరిగిందని గ్రంథాలయ అధికారి ఎల్వి రమణ తెలిపారు. మరింత మంది విద్యార్థులు ఈ విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మల్కాపురంలో...

సబ్బవరంలో...

సబ్బవరం : స్థానిక సబ్బవరం శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయం అధికారి వి శిరీష ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని ఎంఈఓ-2 రవీంద్రబాబు, సర్పంచ్ దెడ్డం ప్రసాద్ రావు ప్రారంభించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ రిటైర్ అధికారి రత్నకుమారి, వార్డ్ మెంబర్ కొల్లి కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆనందపురం : అనందపురం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం గ్రామపెద్దలు చందక సూరిబాబు, కొట్యాడ రెడ్డిబాబు ప్రారంభించారు. గ్రంథాలయాధికారి బివిఎస్.అప్పారావు అముద్రిత కథలను వివరించారు. బాలలచే పుస్తక పఠనము, కథలు చెప్పించారు. అనంతరం విద్యార్థులతో ఇండోర్ ఆటలు ఆడించారు.

ములగాడ : మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని మండల విద్యాశాఖాధికారి డివి.త్రినాధరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి అజయ్ కుమార్, ఉపాధ్యాయులు పి.ఈశ్వరరావు, పాఠకులు సన్యాసిరావు, జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : పెందుర్తి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యాన వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. 26 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులు కథలు చదవడం, రాయడం నేర్చుకున్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు దాసరి సత్యం మాస్టర్ దేశభక్తి గీతాన్ని నేర్పించారు. ఈ కార్యక్రమంలో పి.భూలోకరావు, ఆడారి రామకృష్ణ, జానకిరామ్, బి.లక్ష్మీతేజ పాల్గొన్నారు.

టిడిపి గ్రామ శాఖ కమిటీల ఎన్నిక

ప్రజాశక్తి- మాడుగుల:మాడుగుల మండలంలో నాలుగు గ్రామాల్లో గ్రామ శాఖ అధ్యక్ష,కార్యదర్శులను ఎన్నుకోవడం జరిగిందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు అద్దేపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు తెలిపారు. మాడుగుల మండలంలో ఆవురవాడ పంచాయతీ అధ్యక్షుడిగా ధార భీమరాజు, కార్యదర్శిగా తంటపురెడ్డి వరహాల నాయుడులను ఎన్నుకోగా, కింతలి వల్లపురం అధ్యక్షుడిగా మజ్జి బాబ్జి, కార్యదర్శిగా బడుగు భూషణంను ఎన్నుకున్నారు. కింతలి గ్రామ అధ్యక్షుడిగా పల్లారాము, కార్యదర్శిగా కోన నాగరాజు ఏకగ్రీవం చేశారు. జమ్మి దేవి పేట గ్రామ అధ్యక్షుడిగా సాడి అర్జున,కార్యదర్శిగా వెల్లంకి సత్యం నాయుడును ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో కేజే పురం ఎంపీటీసీ బీసెట్టి శ్రీనివాసరావు, మండల యూత్ అధ్యక్షులు రాజ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ పుప్పాల రమేష్ పాల్గొన్నారు.

నియామక పత్రాన్ని అందిస్తున్న అప్పలరాజు

విశాలంగా ఉన్న మాడుగుల, పాడేరు రహదారి

సంత మార్పుతో తీరిన చింత

ప్రజాశక్తి- మాడుగుల:ప్రతి సోమవారం మాడుగులలో జరిగే వారపు సంతను ఎట్టకేలకు మార్పు చేయడంతో ప్రజలకు ట్రాఫిక్ చింత తీరింది.ప్రతి సోమవారం జరిగే ఈ వారపు సంత రోడ్లమీద జరుగుతుండడంతో ప్రజలు ముఖ్యంగా ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంధులకు గురయ్యేవారు. పాడేరు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో బస్సులతో పాటు వివిధ రకాల వాహనాదారులు, ప్రయాణికులు సోమవారం వస్తే ప్రయాణం సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడేవారు .ఈ నేపథ్యంలో సంతను మార్చాలని గత కొంతకాలంగా స్థానికులు పంచాయతీ అధికారులకు మొరపెట్టుకున్నారు. స్థానికుల అభ్యర్థన మేరకు సంత ప్రాంతంలో ఉన్న పాత షెడ్లను తొలగించి ఆ స్థలాన్ని చదును చేసి రోడ్లపై వ్యాపారం చేస్తున్న దుకాణ దారులకు అమ్మకాలకు కేటాయింపులు చేశారు. దీంతో ప్రధాన రహదారి విశాలంగా ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తీరనుంది.

పరామర్శిస్తున్న జోగులు, నాయకులు

వైసిపి నేతలకు పరామర్శ

ప్రజాశక్తి -నక్కపల్లి:ఇటీవల హార్ట్ సర్జరీ చేయించుకున్న మండల కో ఆప్షన్ సభ్యులు, వైసిపి నేత లోడగల చంద్రరావు, గొడిచెర్ల సర్పంచ్ అల్లు రమణ, రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సీతంపాలెం గ్రామానికి చెందిన గొర్ల గోవిందును సోమవారం పాయకరావుపేట నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, పాయకరావుపేట వైసీపీ మండల శాఖ అధ్యక్షులు చిక్కాల రామరావు, నక్కపల్లి వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, తదితర నాయకులు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చొడిపిల్లి అప్పన్న, యలమంచిలి తాతబాబు, మనబాల దేవుళ్ళు, గొర్ల నాగ అప్పలరాజు, కురందాసు నాని తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి చెక్ అందజేస్తున్న వెంకటేష్

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలో దేవవరం గ్రామానికి చెందిన యలమంచిలి అప్పలరాజుకు తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ రూ.60 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ, అప్పలరాజు వెన్ను నొప్పితో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని హెూం మంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకు వెళ్లడంతో సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారన్నారు.

ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

లేటరైట్ పేరుతో బాక్సైట్ తవ్వకాలు

-కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే గణేష్ ఫిర్యాదు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం నియోజకవర్గం నాతవరం మండలం సుందరకోటలో లేటరైట్ పేరుతో బాక్సైట్ తవ్వుతున్నారంటూ నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగు రోజుల నుంచి జరుగుతున్న తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందా అని ప్రశ్నించారు. ప్రభుత్వం తవ్వకాలకు అనుమతులు ఇస్తే గతంలో చంద్రబాబు రూ.15వేల కోట్లు దోపిడి జరుగుతుందని స్వయంగా అన్నారని, ఇప్పుడు అనుమతులు ఎందుకు ఇచ్చారన్నారు.

అపరిష్కృత వేదిక

తంతుగా మారిన పిజిఆర్ఎస్ ▸ పరిష్కారంపై లేని దృష్టి ▸ పేరుకుపోతున్న రెవెన్యూ సమస్యలు

కలెక్టర్‌కు సమస్యను విన్నవిస్తున్న వృద్ధురాలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి :ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) తంతుగా నడుస్తోంది తప్ప ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా లేదు. గ్రామ స్థాయిలో రెవెన్యూ సమస్యలు కుప్పలుతెప్పలుగా వున్నాయి. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ మొదలుకొని మండలాల్లో తహాశీల్దార్, ఆ కింది రెవెన్యూ సిబ్బంది వరకు రెవెన్యూ సమస్యలపై సరైన దృష్టి పెట్టకపోవడంతో అనేకసార్లు కలెక్టరేట్, ఆర్‌డిఓ, తహాశీల్దార్ కార్యాలయాలకు వస్తూనేవున్నారు. సోమవారం నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి హాజరయ్యారు. పిజిఆర్ఎస్‌లో నమోదైన 252 అర్జీల్లో 122 రెవెన్యూ సంబంధిత సమస్యలే వున్నాయి. పట్టాదారుపాస్‌పుస్తకాలు, సర్వే చేయాలని, రీ సర్వేలో పొరపాట్లు సరిచేయాలని , ఆక్రమణలు వంటి పలు రెవెన్యూ సంబంధిత సమస్యలు వచ్చాయి. కలెక్టరేట్‌లో నమోదైన 257 అర్జీల్లో 152 రెవెన్యూ, 35 సర్వే విభాగానికి సంబంధించినవి వున్నాయి. ఈ అంకెలు సమస్య తీవ్రతను తెలియజేస్తున్నాయి.

నర్సీపట్నం మండలం, దుగ్గాడ పంచాయతీ శ్రీరాంపురానికి చెందిన నారికణాల వీరయ్యకు చెందిన బలిఘట్టం రెవెన్యూ సర్వే నెంబరు 660లో 2.7 సెంట్లు భూమిలో 2.14 సెంట్లు అమ్ముకున్నారు. మిగిలిన భూమికి సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించాలని వీరయ్య మనుములు ఐదుగురు నర్సీపట్నం తహాశీల్దార్ కార్యాలయానికి 2022 ఆగస్టు నుంచి తిరుగుతున్నారు. కలెక్టరేట్, ఆర్‌డిఓ, తహాశీల్దార్ కార్యాలయానికి ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా సర్వే చేయడంలేదని నారికణాల నారాయణమూర్తి ప్రజాశక్తికి తెలిపాడు. కక్షసాధింపు లేదంటూనే అధికార పార్టీ నాయకులు తమకు గిట్టని వారి ప్రభుత్వ పథకాలు రాకుండా చేస్తున్నారు. రోలుగుంట మండలం, ఎం.కొత్తపట్నం పంచాయతీలో పిటిజికి చెందిన గెమ్మెల ఆనంద్‌కు అనే గిరిజనుడు 60 శాతం అంగవైకల్య ధృవీకరణపత్రం వుంది. కాలు వైకల్యంతో బాధపడుతున్న ఆయన ఆరువేల రూపాయలు పింఛన్ పొందుతున్నాడు. అధికార పార్టీ నాయకులు ఆయన పింఛన్‌పై ఫిర్యాదుచేయడంతో మూడు నెలలుగా పింఛన్ ఇవ్వడంలేదని ఆనంద్ తెలిపాడు.

గొలుగొండ మండలం, కె ఎల్లవరం పంచాయతీలో డొంకాడలోని 28 పిటిజి కుటుంబాలు మట్టిగోడల ఇళ్లలో వుంటున్నారు. ఇంతవరకు ఎవరికీ ప్రభుత్వ ఇళ్లు మంజూరుకాలేదు. వర్షం వచ్చినప్పుడు జారిన పెంకులు సర్దుకొని తలదాచుకుంటున్నామని గిరిజనుడు గెమ్మెల సుబ్బారావు తెలిపాడు.

నిరసన చేపడుతున్న కార్మికులు

పంచాయతీ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మండలంలోని వేములపూడి పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు నాయకులు ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. సోమవారం నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో కలెక్టర్ విజయకృష్ణన్ ఆధ్వర్యంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుండగా బయట పంచాయతీ కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, పంచాయతీ కార్మికులకు 18 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. తక్షణమే పెండింగ్ జీతాలు చెల్లించడంతో పాటు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. వారికి సబ్బులు, కొబ్బరినూనె వంటివి అందించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రోడ్డు, తాగునీటి సౌకర్యం కల్పించాలి

-డోలీ మోతలతో గిరిజనుల నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:తమ గ్రామాలకు రోడ్లు, నీటి సౌకర్యం కల్పించడంతో పాటు గిరిజన భూములకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద డోలి మోతల ద్వారా ఆదివాసీ గిరిజనులు ఆందోళన చేపట్టారు. ముందుగా అబీద్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే.గోవిందరావు మాట్లాడుతూ, గొలుగొండ మండలం డొంకాడ గ్రామానికి రోడ్డు నిర్మాణంను తక్షణమే ప్రారంభించాలన్నారు. 2023లో కోటి 60లక్షలతో కరక నుండి డొంకాడ వరకు బీటీ రోడ్డు నిర్మాణరకు నిధులు మంజూరు చేశారని, నేటికీ పనులు ప్రారంభించలేదన్నారు. డొంకాడ గ్రామంలో 14 మంది చిన్న పిల్లలు జిల్లేడుపూడి గ్రామానికి రాను పోను ఆరు కిలో మీటర్లు కొండ దారిలో నడిచి వెళ్లాల్సి పరిస్థితి ఉందన్నారు. రావికమతం, మాడుగుల, రోలుగుంట మండల పరిధిలోని నీలిబంద, జీలుగువలోవ, పశువులబంద పివిజిట గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలన్నారు. జీలుగు లోవ, పశువులబంద గ్రామాలకు మంచినీటిని సౌకర్యం కల్పించాలని తెలిపారు. గిరిజన గ్రామాలైన పిత్రుగెడ్డ, జాజులబంద, పెదగరువు గిరిజనులు జీలుగకల్లును రవాణా చేస్తే అక్రమంగా కేసులు నమోదు చేశారని, తక్షణమే ఆ కేసులను ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గెమ్మెలి వాసు, కొండా తాంబిలి, వెంకట్రావు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.రాజు, ఆదివాసీ మహిళలు పాల్గొన్నారు.

డోలీ మోతతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

వైద్య శిబిరాలు ఏర్పాటు

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో సోమవారం పిహెచ్‌సి పరిదిలోని గిరిజన గ్రామాలైన పిత్రుగెడ్డ, నీలబందకు కాలినడకని ప్రయాణం చేసి ఆయా గ్రామాలను చేరుకుని ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పిత్రుగెడ్డలో 30 మంది, నీలబందలో 20 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ నూకరాజు, ఎంఎల్‌హెచ్‌పి పార్వతి, ఏఎన్ఎం రాజేశ్వరి, అశా దేముడమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడిపై నిరసన

నర్సీపట్నంలో ర్యాలీ చేపడుతున్న సంఘాల నేతలు

ప్రజాశక్తి- నక్కపల్లి:జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉత్తరాంధ్ర వైస్ చైర్మన్ సకలా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని రమణయ్యపేటలో సోమవారం ఉపాధి కూలీలతో కలిసి ఉగ్ర దాడిని ఖండిస్తూ నిరసన తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విఆర్‌పి దుర్గారావు, సన్యాసిరావు, బాలం బాబులు, లోవరాజు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరశిస్తూ నర్సీపట్నం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో లయన్స్, నవ్యలయన్స్, రోటరీ, వాసవీ క్లబ్‌లు, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్, యూటీఎఫ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి : జమ్మూ కాశ్మీర్ పెహల్గామ్‌లో ఈనెల 22న పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడికి నిరసనగా అనకాపల్లి ఎఎంఎఎల్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు సోమవారం నిరసన ర్యాలీ చేపట్టారు. కళాశాల నుండి కొత్తూరు జాతీయ రహదారి16కు వరుకు ర్యాలీ చేసి, అక్కడ మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జయబాబు మాట్లాడుతూ ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజి సిబ్బంది పాల్గొన్నారు.

మధురవాడ : కాశ్మీర్‌లో ఉగ్రదాడులను వ్యతిరేకిస్తూ మధురవాడ కూడలిలో కొవ్వొత్తులతో సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. మధురవాడ వంతెన మీదుగా జివిఎంసి జోనల్ కార్యాలయం అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి.అప్పలరాజు, పి.రాజుకుమార్, డి.కొండమ్మ, జి.కిరణ్, ఎస్.రామప్పాడు, సిహెచ్.శేషుబాబు, ఎల్.పద్మ, బి.లక్ష్మి, బి.రాంబాబు, కె.పుష్ప, టికె.శారద తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో నిరసన తెలుపుతున్న కూలీలు

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు షష్టిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	9490099125	పూర్ణమార్కెట్	9490099676
మధురవాడ	8008596645	జగదాంబ	9490099434
గాజువాక	9849392359	జివియంసి	9490099483
అనకాపల్లి	8008736188	ద్వారకానగర్	9490099672
చోడవరం	9490099141	కంచరపాలెం	9490099135
నర్సీపట్నం	9440280411	మాదవధార	9490099675
పాడేరు	9490099142		
రంపచోడవరం	9440165617		